తొలిరోజు ప్రశాంతంగా..

- ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు
- ముందస్తు ఏర్పాట్లు.. 144సెక్షన్ అమలు
- పరీక్ష రాసిన 15 మంది అంధ బాలికలు

పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

బడంగ్‌పేట/కందుకూరు/సైదాబాద్/చాదర్‌ఘాట్, మార్చి 18: మహేశ్వరం, ఎల్బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల్లో పదో తరగతి పరీక్షల్లో భాగంగా తొలిరోజు సోమవారం ప్రశాంతంగా జరిగింది. తొలిరోజు పరీక్షా కేంద్రాల వద్ద తల్లిదండ్రుల కోలాహలం కనిపించింది. పరీక్షా కేంద్రాల వద్ద 144సెక్షన్ విధించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా విద్యాశాఖాధికారులు ముందస్తు చర్యలు తీసుకోవడంతో సజావుగా పరీక్షలు జరిగాయి. పరీక్షా సమయానికంటే అరగంట ముందుగానే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తామని ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం చేయడంతో చాలామంది నిర్ణీత సమయం కంటే ముందుగానే పరీక్షా కేంద్రాలకు వచ్చారు. పరీక్షా కేంద్రాల్లో విద్యుత్, తాగునీటి వసతులు, ఫ్యాన్లు, వెలుతురు ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకున్నారు.

- బాలాపూర్ మండలంలో 3,888 మంది విద్యార్థులు ఉండగా.. 3,877 మంది పరీక్షలు రాసినట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ కృష్ణయ్య తెలిపారు. 11 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాలేదన్నారు. సరూర్‌నగర్ మండల పరిధిలో 8,814 మంది విద్యార్థులు.. 8,778 మంది పరీక్షలు రాసినట్లు తెలిపారు. 16 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాలేదు.
- కందుకూరు మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న 789 మంది విద్యార్థులకు నేదునూరు లోని ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో రెండు సెంటర్లు, కందుకూరు జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో రెండు సెంటర్లు, మండల కేంద్రంలోని నోబుల్ హై స్కూల్‌లో మరో రెండు సెంటర్లు మొత్తం 6సెంటర్లను ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాలను ఎంపీడీఓ సరిత, విద్యాధికారి మనోహర్ తనిఖీ చేశారు. పరీక్షకు హాజరైన విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో వెంట మండల వ్యవసాయ అధికారి లావణ్య, రవికుమార్, శ్రీధర్ ఉన్నారు.
- సైదాబాద్ జోన్ పరిధిలోని 22 పరీక్షా కేంద్రాల్లో 4,823 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా అందులో 6 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.
- మలక్‌పేట బి-బ్లాక్ ప్రభుత్వ అంధ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన 15 మంది బాలికలు మలక్‌పేట ప్రభుత్వ పాఠశాల పరీక్షా కేంద్రంలో సహాయకుల చేత పరీక్షలు రాశారు. పాఠశాలకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు అంధ బాలికలను ప్రత్యేక వాహనంలో మలక్‌పేటలోని పరీక్షా కేంద్రానికి తీసుకొచ్చి వారిచేత పరీక్షలు రాయించారు.
- చార్మినార్ జోన్ పరిధిలో మొత్తం 23 పరీక్షా కేంద్రాల్లో 21 రెగ్యులర్, 2 ప్రైవేట్‌గా పరీక్షలకు హాజరయ్యే కేంద్రాలను ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రెగ్యులర్ విద్యార్థుల్లో 4,176 ఉండగా మొదటి రోజు 4,151 హాజరయ్యారని, 25 మంది గైర్హాజరు అయ్యారని తెలిపారు. అదే విధంగా ప్రైవేట్ విద్యార్థుల్లో మొత్తం 90 ఉండగా 51 మంది హాజరయ్యారని, 39 మంది గైర్హాజరయ్యారని విద్యాశాఖ చార్మినార్ జోన్ డిప్యూటీ డీఈఓ నెహ్రూ బాబు పేర్కొన్నారు.

నేదునూరు పరీక్షా కేంద్రంలో ఎంపీడీఓ సరిత, విద్యాధికారి మనోహర్

జిల్లెలగూడలో పదో తరగతి పరీక్షల సందర్భంగా బందోబస్తు నిర్వహిస్తున్న మీర్‌పేట పోలీసులు

ఎంపీ రంజిత్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఎంపీ రంజిత్‌రెడ్డి అవకాశవాది

ఆర్కేపురం, మార్చి 18: చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆర్కేపురం డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కంచర్ల శేఖర్, డివిజన్ ప్రధాన కార్యదర్శి సిద్దగోని వెంకటేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్‌నగర్ చౌరస్తాలో ఎంపీ రంజిత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నన్ని రోజులు పదవులు అనుభవించి పార్టీ మారడం సిగ్గుచేటని పేర్కొన్నారు. ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి రావాలి తప్ప అధికారమే పరమావధిగా పార్టీలు మారడం దివాలా కోరుతనానికి నిదర్శనమన్నారు. బీఆర్ఎస్ పార్టీ రంజిత్‌రెడ్డికి ఎంత ప్రయారిటీ ఇచ్చిందో ఒక్కసారి ఆలోచించుకోవాలని తెలిపారు. అవకాశవాదులు ఏ పార్టీ అధికారంలో ఉంటే అందులోకి వెళ్తారని, అలాంటివారికి ప్రజలు తగిన బుద్ధి చెపుతారన్నారు. బీఆర్ఎస్ పార్టీని ఎవరు వీడినా ఒరిగేదేమి లేదని, పార్టీకి ఉద్యమకారులు అండగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాలకొండ శ్రీనివాస్‌రెడ్డి, కొండ్ర శ్రీనివాస్, బండారి మల్లేశ్ ముదిరాజ్, పలిగొండ దీపు, రమేశ్ కుర్మ, మల్లేశ్‌గౌడ్, రూపేశ్, సంజయ్, వీర స్వామి, జావేద్ పటేల్, పదిరే శంకర్, సిద్దగోని శివ, ఈర్ల జగదీశ్, ఈశ్వర్ తదితరులు ఉన్నారు.

ముస్లింలకు రెండు ఎంపీ సీట్లు ఇవ్వాలి

చాదర్‌ఘాట్, మార్చి 18: త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో రెండు ఎంపీ సీట్లను ముస్లింలకు కేటాయించాలని బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌కు కులీ కుతుబ్‌షా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మౌలానా ఇర్ఫాన్ జాఫారీ కోరారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా కేసీఆర్ బాధ్యతలు చేపట్టిన తరువాత మొదట ముస్లింలకు ప్రాధాన్యత ఇవ్వడం ప్రారంభించారన్నారు. ఉపముఖ్యమంత్రి, హోంమంత్రిని మహమూద్ అలీని చేయడం స్పష్టమైన ఉదాహరణగా పేర్కొన్నారు. తద్వారా ముస్లింలకు కూడా సమాన వాటా ఉందని దేశవ్యాప్తంగా సందేశాన్ని ఇచ్చారని కొనియాడారు. లౌకికవాదం కలిగిన బీఆర్ఎస్ పార్టీకి ముస్లింల సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో రెండు ఎంపీ సీట్లను ముస్లింలకు కేటాయించాలని మౌలానా ఇర్ఫాన్ జాఫారి కోరారు.

రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్‌గా వీరయ్య

మలక్‌పేట, మార్చి 18: రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్(సహకార సంస్థ)చైర్మన్‌గా నల్గొండ జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన ముత్తినేని వీరయ్యను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కాంగ్రెస్ పార్టీలో వికలాంగుల విభాగం చైర్మన్‌గా పనిచేసిన వీరయ్య, దివ్యాంగులకు రిజర్వేషన్లు, పింఛన్లు, ఉద్యోగాల కల్పన కోసం పోరాటం చేశారు. ప్రముఖ విద్యావేత్తగా శ్రీరామానుజన్ ఐఏఎస్ స్టడీ సర్కిల్ పేరుతో అనేక మంది అభ్యర్థులకు శిక్షణ ఇచ్చిన అనుభవం కలిగిన వీరయ్య, శిలలిజం(అర్థమెటిక్, రీజనింగ్, ప్యూర్ మేథమెటిక్స్)లో దేశంలోనే మంచి ఫ్యాకల్టీగా మంచి పేరును సంపాదించుకున్నారు. 2010లో తెలంగాణ దివ్యాంగులు, వితంతువులు, వృద్ధుల హక్కుల పోరాట సమితిని ఏర్పాటుచేసి వారి హక్కులకోసం పోరాటం చేశారు. దివ్యాంగులకోసం పోరాటం చేసిన వీరయ్య సేవలను గుర్తించిన ప్రభుత్వం రాష్ట్ర దివ్యాంగుల సహకార సంస్థ చైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

సైదాబాద్‌లో అదనపు బలగాల ఫ్లాగ్ మార్చ్

సైదాబాద్, మార్చి 18 : పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ డి.జానకి ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం సైదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సమస్యాత్మకమైన, సున్నిత ప్రాంతాల్లో పోలీసు అదనపు బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ముంతాజ్ కాలనీ, జీవన్‌యార్‌జంగ్ కాలనీ, జాకీర్ హుసేన్ కాలనీ, అమీన్ కాలనీ, సపోటాబాగ్ తదితర ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ చేశారు. అదే విధంగా ఎన్నికల నేపథ్యంలో నగర పోలీస్ కమిషనర్ అదేశాల మేరకు సైదాబాద్ పోలీసులతోపాటు ప్రత్యేక బలగాల పోలీసులతో కలిసి వాహనాలను వాహనాల తనిఖీలు చేపట్టారు. ప్రధాన రహదారిపై, చెక్ పోస్ట్‌ల వద్ద సీఐఎస్ఎఫ్, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బందితో కలిసి వాహనల తనిఖీలు, అనుమానిత వ్యక్తులను క్షుణంగా తనిఖీలు చేస్తున్నారు. ఫ్లాగ్ మార్చ్ కార్యక్రమంలో డీసీపీ జానకి, సైదాబాద్ డివిజన్ ఏసీపీ వెంకన్న నాయక్, సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ పాల్గొన్నారు.

సైదాబాద్‌లో ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్న సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ డి.జానకి, ఏసీపీ వెంకన్న నాయక్, సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ తదితరులు

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

ఆర్కేపురం, మార్చి 18: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని భాష్యం జోనల్ ఇన్‌చార్జి అంకమ్మరావు తెలిపారు. భాష్యం లిటిల్ చాంప్స్ జోనల్ లెవల్ ఫైనల్ స్పోర్ట్స్ మీట్ కాంపిటిషన్ మీర్‌పేట్ క్రీడా మైదానంలో నిర్వహించారు. భాష్యం జోన్-3కి సంబంధించిన 8 బ్రాంచిల మధ్య వివిధ క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జోనల్ ఇన్‌చార్జి అంకమ్మరావు హాజరై మాట్లాడారు. క్రీడలతో మానసిక వికాసాన్ని, శారీరాక ధృడత్వానికి ఎంతో తోడ్పడుతాయని చెప్పారు. ఈ క్రీడా పోటీల్లో దిల్‌సుఖ్‌నగర్ బ్రాంచ్ విద్యార్థులు చాంపియన్ షిప్ ట్రోఫీని గెలుచుకొని మొదటిస్థానంలో నిలిచారు. గెలుపొందిన విద్యార్థులకు అంకమ్మరావు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎనిమిది బ్రాంచిలకు చెందిన ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

గెలుపొందిన విద్యార్థులతో అంకమ్మరావు తదితరులు

బాల్య మిత్రుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేస్తున్న తోటి స్నేహితులు

పూర్వ విద్యార్థుల ఆర్థిక చేయూత

బడంగ్‌పేట, మార్చి 18: రంగారెడ్డి జిల్లా మాడ్గుల జడ్పీహెచ్ఎస్‌లో 1993-1994లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ప్రమాదవశాత్తు మృతి చెందిన తోటి స్నేహితుల కుటుంబాలకు ఆర్థిక సాయం చేశారు. మాడ్గుల మండలం పెద్ద మాడ్గుల గ్రామానికి చెందిన సుదర్శన్ రెడ్డి మృతిచెందాడు. అతడికి భార్య, ముగ్గురు కూతుర్లు ఉన్నారు. అదే విధంగా మాడ్గుల మండలం నాగిల్ల గ్రామానికి చెందిన మల్లేశ్ యాదవ్ అనారోగ్యంతో మరణించాడు. అతడికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. వారికి పెద్ద దిక్కు లేక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న విషయం తెలుసుకున్న బాల్య స్నేహితులు సోమవారం సుదర్శన్ రెడ్డి కుటుంబానికి రూ.50వేలు, మల్లేశ్ యాదవ్ కుటుంబానికి రూ.36వేల ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా ఆపదలో ఆదుకున్న పూర్వ విద్యార్థులకు సుదర్శన్ రెడ్డి, మల్లేశ్ యాదవ్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వెంకటేశ్వర కాలనీ అసోసియేషన్ నూతన కమిటీ



ఆర్కేపురం, మార్చి 18: సరూర్‌నగర్ డివిజన్ వేంకటేశ్వర కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీలో నిర్వహించిన సమావేశంలో ఎన్నికల అధికారి శాంతి ప్రసాద్ సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గండు ధనంరెడ్డి, ఉపాధ్యక్షుడిగా మారోజు శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శిగా పీవీఎస్.ప్రసాద్, కోశాధికారిగా ఎస్‌వీఎస్.సాయి కిరణ్, జాయింట్ సెక్రటరీలుగా పి.మధుసూదన్‌రెడ్డి, బోడ శంకర్, కల్చరల్ సెక్రటరీగా రామొగ్గల విజయ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బంగారు సందీప్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు గండు ధనంరెడ్డి మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. కాలనీలోని సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల, ప్రజా ప్రతినిధులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తమ ఎన్నికకు సహకరించిన కాలనీ వాసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలి

- కేంద్రంలో మళ్లీ బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుంది
- రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి

కందుకూరు, మార్చి 18: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి తెలిపారు. సోమవారం కందుకూరు మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని కోరారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి మరోమారు అధికారం కట్టబెట్టడం ఖాయమని తెలిపారు. రంజిత్‌రెడ్డిని ఎంపీగా గెలిపిస్తే అభివృద్ధిని విస్మరించాడని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఎక్కడా అభివృద్ధి చేయలేదని పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం వల్లనే సుస్థిర పాలన సాధ్యమని పేర్కొన్నారు. పార్టీలు మారే వ్యక్తులను గెలిపిస్తే వారి స్వార్థం కోసం పని చేస్తారు తప్పా.. ప్రజల కోసం పనిచేయరని చెప్పారు. కొండ విశ్వేశ్‌రెడ్డిని గెలిపించి కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం హామీలను నెరవేర్చడంలో విఫలమైనట్లు తెలిపారు. స్వార్థపరులను నమ్మవద్దని కోరారు. బీజేపీపై సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న ఆరోపణలు సరికాదని పేర్కొన్నారు. బీజేపీ అభ్యర్థులను గెలిపించి కాంగ్రెస్ పార్టీ కళ్లు తెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కందుకూరులో మాట్లాడుతున్న రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి

బీఆర్ఎస్ సత్తా చాటాలి

- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

కందుకూరు బీఆర్ఎస్ పార్టీ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

కందుకూరు, మార్చి 18 : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తాచాటాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. సోమవారం మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సురుసాని రాజశేఖర్ రెడ్డి, నియోజకవర్గం యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్ల కార్తీక్, యూత్ నాయకుడు బొక్క దీక్షిత్‌రెడ్డితో కలిసి ఆమె మాట్లాడుతూ.. కొంత మంది స్వార్థపరులు పార్టీ మారుతున్నారని.. అయినా పార్టీకి ఎలాంటి నష్టం లేదని.. ప్రజల అండ ఉన్నంత వరకు బీఆర్ఎస్ పార్టీని ఎవరూ ఏం చేయలేరని పేర్కొన్నారు. గుర్తింపు లేని వారికి టికెట్ ఇచ్చి గెలిపిస్తే.. కేసీఆర్ మేలు మర్చిపోయి పార్టీని వీడటం సమంజసం కాదని హితవు పలికారు. చేవెళ్ల బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకొని.. బీఆర్ఎస్ సత్తా ఏంటో చూపాలని కార్యకర్తలను కోరారు. ఇటీవల పార్టీ మారిన కొంత మంది బీఆర్ఎస్ నాయకుల వద్దకు వచ్చి కాంగ్రెస్ పార్టీలో చేరాలని ఒత్తిడి తెస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్ స్థానాన్ని గెలిపించి.. కష్టకాలంలో కేసీఆర్‌కు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో యూత్ నాయకులు గొర్రెంకల రామకృష్ణ ముదిరాజ్, రాకేశ్‌రెడ్డి ఉన్నారు.

వడ్డేపల్లి రాంచందర్‌కు సన్మానం

నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్ క్యాస్ట్ మెంబర్‌గా నియమితులైన వడ్డేపల్లి రాంచందర్‌ను సన్మానిస్తున్న జీఎస్ఐ సౌథెర్న్ రీజియన్ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ ఆదర్ల మహేశ్, రీజినల్ సెక్రటరీ మధిర సత్యనారాయణ

మన్సూరాబాద్, మార్చి 18: నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్ క్యాస్ట్ మెంబర్‌గా నియమితులైన వడ్డేపల్లి రాంచందర్‌ను నగరంలోని డైరెక్టర్ నేషనల్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం జీఎస్ఐ సౌథెర్న్ రీజియన్ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ ఆదర్ల మహేశ్, రీజినల్ సెక్రటరీ మధిర సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఎల్బీనగర్, బండ్లగూడలోని జీఎస్ఐ కార్యాలయాన్ని సందర్శించాలని నేషనల్ కమిషనర్ ఫర్ షెడ్యూల్ క్యాస్ట్ మెంబర్‌గా నియమితుడైన వడ్డేపల్లి రాంచందర్‌ను కోరడం జరిగిందని జీఎస్ఐ సౌథెర్న్ రీజియన్ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. జీఎస్ఐ కార్యాలయంలో రెగ్యులర్‌గా రోస్టర్ మెయింటెనెన్స్ జరుగుతుందో లేదో ఇన్విజిలేటర్ ద్వారా తనిఖీ చేయించాలని కోరడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు బి. ఆనంద్‌కుమార్, ఎన్‌టీ బాబు, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

ఎల్బీనగర్, మార్చి 18: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేం మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. కోదండరాంనగర్ కాలనీలో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర రావు, కాలనీ అధ్యక్షుడు కందికంటి ప్రేంనాథ్ గౌడ్, రత్నం, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

కోదండరాంనగర్‌లో రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బద్దం ప్రేం మహేశ్వర్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు

తెలంగాణ రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన మల్‌రెడ్డి రాంరెడ్డిని సన్మానిస్తున్న గడ్డిఅన్నారం కాంగ్రెస్ మాజీ ఫ్లోర్‌లీడర్ బద్దుల వెంకటేశ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బద్దుల వేణుగోపాల్ యాదవ్, బీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కె. సత్యనారాయణ, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శశికళ, సీనియర్ నాయకులు వక్కలంక శ్రీనివాస్‌రావు, తుడి గోవర్ధన్, తదితరులు

– ఎల్బీనగర్ , మార్చి 18

మైనర్‌పై లైంగికదాడి..

- నిందితునికి యావజ్జీవం
- బాధితురాలికి పదిలక్షల పరిహారం

రంగారెడ్డి జిల్లా కోర్టులు, మార్చి 18 (నమస్తే తెలంగాణ): మాయమాటలు చెప్పి మైనర్ బాలిక(12)పై లైంగికదాడికి పాల్పడిన నిందితుడు హరీశ్(22)కు జీవిత ఖైదు.. రూ.55వేల జరిమానా విధిస్తూ, బాధితురాలికి రూ.10లక్షల పరిహారం అందించాలని న్యాయసేవా సంస్థ ఆదేశిస్తూ రంగారెడ్డి జిల్లా పోక్సో ప్రత్యేక న్యాయస్థానం తీర్పునిచ్చింది. ప్రత్యేక అదనపు పీపీ బర్ల సునీత కథనం ప్రకారం.. కర్మన్‌ఘాట్‌లోని మారుతినగర్‌కు చెందిన మైనర్ బాలిక కుటుంబం కూలీ పని చేసుకుంటూ జీవిస్తుండగా, బాలిక స్థానికంగా ఉన్న పాఠశాలలో 6వ తరగతి చదువుతుంది. బాలిక కుంటుంబం గతంలో కిరాయికి ఉన్న ఇంటిలో టీవీ చూడడానికి వెళ్లగా అక్కడే కార్పెంటర్‌గా పని చేస్తున్న నిందితుడు హరీశ్ బాలికకు మాయమాటలు చెప్పి తన గదికి తీసుకువెళ్లి అత్యాచారం చేశాడు. జరిగిన ఘటనపై బాలిక తన తల్లికి తెలుపగా బాలిక తల్లి సరూర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సీడీవో చందర్ రావు కోర్టు విచారణ సమయంలో కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా, సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితునికి శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది.


తెలంగాణ రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డిని సన్మానించిన చైతన్యపురి కాంగ్రెస్ మైనార్టీ అధ్యక్షుడు షేక్ జానీపాషా – ఎల్బీనగర్ , మార్చి 18